తండాలను జీపీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్: సొనాలలో భోగ్ బండారా పూజలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, ఫిబ్రవరి 22 : తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా సొనాలలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. మొదట బంజారా సంప్రదాయ ప్రకారంగా ప్రత్యేక పూజ చేసి భోగ్ బండారాలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ వచ్చాకే రాష్ట్రంలో సేవాలాల్ జయంతి ఉత్సవాలకు గుర్తింపు వచ్చిందన్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఏటా జయంతిని అధికారికంగా నిర్వహించిందని గుర్తు చేశారు. సొనాల మండలం ఏర్పడ్డాక మొదటిసారిగా సేవాలాల్ జయంతి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు సదానందం, శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ స్వామి, శంకర్, సాకరాం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన దివాకర్ రెడ్డి మాతృమూర్తి ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఏ సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకురావాలి

గ్రామాల్లో ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులు, మహిళలతో ముచ్చటించారు. రూ.4 వేల పింఛన్ ఇయ్యారా అని ఓ అవ్వ ఎమ్మెల్యేతో ఆవేదన వ్యక్తం చేసింది. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అంజి గ్రామంలో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

వృథాగా మిషన్ భగీరథ నీరు

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని అంజి గ్రామంలో మిషన్ భగీరథ నీరు నిత్యం వృథాగా పోతుంది. మిషన్ భగీరథ పథకం ట్యాంకు నుంచి గ్రామానికి సరఫరా చేసే పైపు లీకేజీ ద్వారా రాత్రి పగలు నీరు మురుగుకాలువలో పడి వృథాగా పోతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖల అధికారులు పట్టించుకొని మిషన్ భగీరథ నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 22:

మెట్లపై తొలగిన చెత్త

ఈజీఎస్ కార్యాలయంలో మెట్లపై నుంచి తొలగించిన చెత్త

నమస్తే ఎఫెక్ట్

కుభీర్, ఫిబ్రవరి 22: నిర్మల్ జిల్లా కుభీర్ లోని ఉపాధి హామీ కార్యాలయంలోని మెట్లపై ఎన్నో రోజుల నుంచి పనికి రాని వస్తువులు, కుప్పలుగా వేసిన చెత్తను శనివారం ఏపీవో రాథోడ్ హరిలాల్ తొలగింప చేశారు. 'ఈజీఎస్ కార్యాలయం చెత్త మయం' అనే శీర్షిక ఈ నెల 20వ తేదీన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎంపీడీవో నవనీత్ కుమార్, ఏపీవో రాథోడ్ హరిలాల్‌కు కథనంపై రిప్లై ఇవ్వాలని నోటీసులు పంపారు. దీంతో స్పందించిన వారు శనివారం ఉదయం నుంచి చెత్తను పూర్తిగా తొలగింప చేసి నీటితో మెట్లను శుభ్రం చేయించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ కోర్సు ప్రారంభం

ఎదులాపురం, ఫిబ్రవరి 22 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో శనివారం ఆంగ్ల విభాగం తరఫున 30 రోజుల పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ అనే అంశంపై సర్టిఫికెట్ కోర్సును ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రఘుగణపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ఆంగ్ల భాషలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. కోర్సు ద్వారా ఉపాధి అవకాశాలు సంపాదించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆంగ్లభాష కోర్స్ కోఆర్డినేటర్ అనిత, ఆంగ్ల అధ్యాపకులు సంతోషిని, భువనేశ్వరి, గోపాల్, నరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థపై అవగాహన

ఎదులాపురం, ఫిబ్రవరి 22 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అర్థశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాసం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా అర్థశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ ముంతాజ్ బేగం హాజరయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ అనే అంశం మీద ప్రపంచంలోని ఆర్థిక వ్యవస్థ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. భారతదేశంలో ఎగుమతులు, దిగుమతులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం గురించి వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రఘుగణపతి, అర్థశాస్త్ర అధ్యాపకులు కోటయ్య, స్వప్న, అఫ్రోజ్ ఖాన్, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

ముథోల్, ఫిబ్రవరి 22 : గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో శివకుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నిర్మల్ జిల్లా ముథోల్‌లోని మండలాభివృద్ధి కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీరు రానిబో బోరుబావులు వేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఏఈ అరుణ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలి

మాట్లాడుతున్న డాక్టర్ వైసీ శ్రీనివాస్

ఇచ్చోడ, ఫిబ్రవరి 22: గర్భిణులు, బాలింతల వివరాలు రికార్డుల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని జిల్లా ఇమ్యూనికేషన్ అధికారి డాక్టర్ వైసీ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నర్సాపూర్(టీ) పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతల రికార్డులు పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బ్రహ్మానందం రెడ్డి, సచిన్, వైద్యాధికారి హిమబిందు, వైద్య సిబ్బంది రాథోడ్ కృష్ణ, మంజుల, ఏఎన్ఎం జీవిత, ఆశాకార్యకర్త ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

పెంబి, ఫిబ్రవరి 22: అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నాయకుడు భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం రాయదారి గ్రామంలో ఇటీవల విద్యుదాఘాతంతో ఏడు ఇండ్లు కాలిపోగా బాధిత కుటుంబాలను శనివారం పరామర్శించారు. అగ్ని ప్రమాద ఘటన చాలా బాధకరమని విచారం వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రాణహాని జరగకపోవడం అదృష్టమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ఘటనలో సర్వస్వం కోల్పోయిన మూడు కుటుంబాలకు రూ.5 వేలు, మిగతా నాలుగు కుటుంబాలకు రూ. 3 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సల్లా నరేందర్ రెడ్డి, నాయకులు భూక్యా గోవింద్, మహేందర్ ఉన్నారు.

భూమన్న మరణం తీవ్ర విషాదానికి గురి చేసింది

నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, ఫిబ్రవరి 22 : గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి భూమన్న మరణం తీవ్ర విషాదానికి గురి చేసిందని మాజీమంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని వాల్మీకినగర్‌లో వారి నివాసానికి చేరుకొని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బొంపల్లి భూమన్నతో ఉన్న స్నేహపూర్వక సంబంధాన్ని కుటుంబ సభ్యులకు తెలుపుతూ ఆయన మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శ్రద్ధాంజలి ఘటించారు.. గంగపుత్ర శివాలయం అభివృద్ధికై పలుమార్లు కలుస్తూ చర్చిస్తుండేవాడని పేర్కొన్నారు. ఇక్కడ బొంపల్లి సాయిలు, రాజు, నారాయణ, శ్రీనివాస్, సాజీదుద్దీన్, కుమ్ర రాజు ఉన్నారు.

ఇచ్చోడ మండల వ్యవసాయాధికారి సస్పెన్షన్

ఇచ్చోడ, ఫిబ్రవరి 22: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న జాదవ్ కైలాష్‌ను కలెక్టర్ రాజర్షి షా సస్పెండ్ చేశారని శనివారం జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఒకరి పేరుపైన ఒకరు టీఆర్ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం, కౌలు రైతులుగా ఫర్టిలైజర్, పత్తి వ్యాపారంలో పేర్లు నమోదు చేయడంపై విజిలెన్స్ అధికారులు గుర్తించడంతో ఏవోను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

రేపటి ప్రజావాణి రద్దు

ఎదులాపురం, ఫిబ్రవరి 22 : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికల సందర్భంగా జిల్లా అధికారులు ఎన్నికల విధులు నిర్వహించడం, ఎన్నికలపై శిక్షణ తరగతులు ఇవ్వనున్నందున సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు.ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి కలెక్టరేట్‌కు రాకూడదని కోరారు.

24న విద్యా సంస్థలకు సెలవు

ఎదులాపురం, ఫిబ్రవరి 22: బంజారాల ఆరాధ్య గురువు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 24న ఆదిలాబాద్‌లోని రాంలీలా మైదానంలో జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ఒకప్రకటనలో తెలియజేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండవ శనివారం ఏప్రిల్ 12వ తేదీన వర్కింగ్ డే గా ప్రకటించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

పెంబి, ఫిబ్రవరి 22: నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని రాయదారి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన రాథోడ్ నరేశ్ కుటుంబానికి రూ. 50 వేలు, జాదవ్ ఖీమ్యా కుటుంబానికి రూ. 50 వేలు, రాథోడ్ బిక్కు కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆర్ఐ శత్రుఘ్నన్ చేతుల మీదుగా అందజేశారు. మండల వాసులు గ్రామాభివృద్ధి కమిటీని అభినందిస్తున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శిక్షణతో యువత నైపుణ్యం పెంపు

ఉట్నూర్, ఫిబ్రవరి 22: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్(టాస్క్) శిక్షణతో యువతలో నైపుణ్యం పెంపొందుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాణి అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో 21వ సెంచరీ ట్రాన్సరబుల్ స్కిల్స్ అంశంపై మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ ముగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, ద్రవ్య నిర్వహణ, సాంకేతికత అన్వయించుకోవడం, టీంవర్క్ లాంటి అంశాలపై శిక్షణ పొందారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభిమానం చాటుకున్న బీఆర్ఎస్ నాయకులు

కుంభమేళాలో కారు గుర్తు లోగోతో బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్, ఫిబ్రవరి 22 : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు ఖానాపూర్ బీఆర్ఎస్ నాయకులు తరలి వెళ్లారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు తెలిపారు. అనంతరం కుంభమేళాలో బీఆర్ఎస్ టీ షర్టులు, కారు గుర్తు లోగో, జాన్సన్ నాయక్ ఎమ్మెల్యేగా గెలుపొందాలని ఆకాంక్షిస్తూ ప్రదర్శించినట్లు వివరించారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు చుక్కల నరేశ్, అమంద శ్రీకాంత్ ఉన్నారు.

ఆదివాసీ ఎమ్మెల్యే కోవలక్ష్మిని అవమానిస్తే ఊరుకోం

ఉట్నూర్, ఫిబ్రవరి 22: బీఆర్ఎస్ ఆదివాసీ ఎమ్మెల్యే కోవలక్ష్మిని అవమానిస్తే ఊరుకోమని ఆ పార్టీ నాయకుడు, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు భరత్ చౌహాన్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో ఆయన మాట్లాడారు. ఆసిఫాబాద్ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఆదివాసీ, లంబాడీల గొడవకు సూత్రధారన్నారు. విభజించు పాలించు ఆయన లక్ష్యమన్నారు. జిల్లాలో ఆదివాసీలకు, అణగారిన వర్గాలకు దక్కాల్సిన డీసీసీ అధ్యక్షుడి పోస్టును తన వద్దనే పెట్టుకున్నాడన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 22 : నిర్మల్‌లోని 42 వార్డుల్లోని ప్రజలు సకాలంలో తమ పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ అన్నారు. శనివారం నిర్మల్‌లో మున్సిపల్ అధికారులు ఇంటింటా పన్నులు వసూలు చేశారు. పన్నులు చెల్లించని మొండి బకాయిదారుల ఆస్తులను స్వాధీనం చేస్తున్నారు. ప్రియయదర్శిని నగర్ కాలనీలో పన్నులను ఎగవేస్తున్న ఓ ఇంటి యజమాని గేటును స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ప్రజలు మార్చి 31వ తేదీలోపు అన్ని రకాల పన్నులు చెల్లించాలని సూచించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఖానాపూర్, ఫిబ్రవరి 22: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని ప్రభుత్వ దవఖానలో ఖానాపూర్, లక్ష్మణచాంద, మమడ మండలాల నుంచి ప్రభుత్వ రెసిడెన్సియల్ పాఠశాలలో చదువుతున్న 130 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు చేశారు. నేత్ర వైద్యుడు ఇద్రీస్ అక్బానిచంద్ దగ్గరి, దూరం చూపు, మోతేబిందు కంటి సమస్యతో బాధడుతున్న వారిని గుర్తించి ఉచిత కంటి అద్దాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ వంశీమాధవ్, నేత్ర వైద్యుడు రాంరారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 22 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అర్లి(బీ)లో గల నిషాన్‌ఘాట్ ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శనివారం నిషాన్‌ఘాట్‌లో రూరల మండల కార్యదర్శి బత్తుల గంగా రెడ్డి అధ్యక్షతన గ్రామ శాఖల మహాసభలు నిర్వహించారు. ఇందులో 22 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నిషాన్‌ఘాట్ కార్యదర్శిగా పీ సంగీత, అర్లి (బీ)శాఖ కార్యదర్శిగా తూడం భూమన్న, లాండసాంగి కార్యదర్శిగా ఎస్కే హుస్సేన్‌ను ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నిషాన్‌ఘాట్ శాఖ నాయకులు ఆత్రం సంగీత, ఎస్ కృష్ణ, మారుతికాంబ్లే, రమేశ్ కుమార్ హన్, ఎస్‌కే నిస్సర్, ప్రదీప్‌పాల్, ఖలీల్, భాను, అర్లి(బీ) శాఖ సుజాత, భూమన్న, వెంకన్న, లాండసాంగిశాఖ నాయకులు సాంబశివ, దత్తు, భూమన్న, ప్రజలు పాల్గొన్నారు.

ఇసుక లారీలు స్వాధీనం

తాంసి(భీంపూర్), ఫిబ్రవరి 22: భీంపూర్ మండల సరిహద్దు గొల్లగట్ తాంసి నుంచి మహారాష్ట్రకు రవాణా అవుతున్న ఇసుక లారీలను పట్టుకొని ఏడుగురు నిందితులపై కేసు నమోదు చేశారు. డీఎస్పీ జీవన్ రెడ్డి శనివారం రాత్రి భీంపూర్‌లో వివరాలు వెల్లడించారు. సీఐ సాయినాథ్, సీఐ కలీం, సిబ్బంది చాకచక్యంగా ఇసుక లారీలు పట్టుకున్నారు. డంపుల నుంచి ఇసుక తరలిస్తున్న మహారాష్ట్ర పూసద్‌కు చెందిన మోసిన్ ఖాన్, సయ్యద్ అత్తర్ అలీ, ఉమర్ ఫారూఖ్, విఠల్, తాంసి(కే)కు చెందిన భూమన్న, సంతోష్, ప్రవీణ్‌లపై కేసు నమోదు చేశామన్నారు. సీఐ, భీంపూర్ పోలీసులను అభినందించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బేల, ఫిబ్రవరి 22: ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని కంగార్‌పూర్ నుంచి అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని విశ్వాసనీయ సమాచారం మేరకు పోలీసుల సిబ్బందితో కలిసి శనివారం తనిఖీలు నిర్వహించారు. మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టుబడ్డాయని ఎస్సై దివ్యభారతి తెలిపారు. సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆమె వెంట ఏఎస్ఐ జీవన్, సిబ్బంది ఉన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

భైంసాటౌన్, ఫిబ్రవరి 22 : ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన భైంసా మండలంలో శనివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మాలిక్ తెలిపిన వివరాల ప్రకారం.. పెండ్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్(58) కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులందరూ భోజనం చేసి నిద్రించారు. శనివారం ఉదయం నిద్రలో నుంచి లేచి చూసేసరికి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది..

లోకేశ్వరం, ఫిబ్రవరి 22 : భార్య కాపురానికి రావడం లేదని మహారాష్ట్రకు చెందిన డబ్బేకర్ బీరప్ప(42) మన్మద్ ఎక్స్‌రోడ్ సమీపంలో గల దారిలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుని అక్క పోలీసులకు సమాచారం అందించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఎదులాపురం, ఫిబ్రవరి 22 : ఆదిలాబాద్‌లోని తిరుమల నగర్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం శనివారం ఉదయం లభించినట్లు మావల ఎస్ఐ వంగ విష్ణువర్ధన్ తెలిపారు. మృతుడి వయసు సుమారు 55 నుంచి 60 మధ్యలో ఉంటుందన్నారు. లైట్ గ్రీన్ కలర్ షర్ట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే మావల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

రైలు ఢీకొని ఐదు పశువుల మృతి

తలమడుగు, ఫిబ్రవరి 22: ఆదిలాబాద్ జిల్లా తలమడుగులోని రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం మధ్యాహ్నం రైలు ఢీ కొని ఐదు పశువుల మృతి ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాందేడ్ నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్న ప్యాసింజర్ రైలు ఢీకొని ఐదు పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో నాలుగు పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. రాజస్థాన్‌కు చెందిన మధుర జాతికి చెందిన పశువుల కాపారులు మేత కోసం ఈ ప్రాంతానికి రాగా రైలు ఢీకొని మృత్యువాత పడ్డాయి. పశు యజమాని కర్తక్, తలమడుగుకు సత్యనారాయణకు చెందిన రెండు పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందిన పశువుల విలువ దాదాపు రూ.2 లక్షలు ఉంటుందని తెలిపారు. సంబంధిత శాఖాధికారులు స్పందించి నష్ట పరిహారం ఇప్పించాలని పశుయజమానులు కోరుతున్నారు.

ఎలుగుబంటి దాడిలో రైతుకు తీవ్రగాయాలు

ఎదులాపురం, ఫిబ్రవరి 22 : ఆదిలాబాద్ జిల్లా మావల మండలం వాఘాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడకు చెందిన రైతు చాకటి దేవ్‌రావ్ (65) తన పంట చేనులో పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా ఎలుగుబంటి దాడి చేసింది. ఈ దాడిలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. అటవీశాఖ శాఖ తరపున చికిత్స పొందుతున్న దేవరావ్‌కి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దర్యాప్తు చేపట్టి మరింత ఆర్థిక సాయం చేస్తామని దేవరావ్ కుటుంబానికి భరోసా కల్పించారు. డీఎఫ్‌వో వెంట బీట్ ఆఫీసర్లు ప్రశాంత్, ఇమ్రాన్ ఖాన్ ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో రైస్‌మిల్లులో మంటలు

లోకేశ్వరం, ఫిబ్రవరి 22 : నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల శివారులోని వెంకట్‌రావు రైస్‌మిల్లులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఏర్పడి దాదాపు రూ. 10 లక్షల విలువ చేసే వడ్ల బ్యాగులు కాలి బూడిద అయ్యాయి. రైస్ మిల్లులో మంటలు ఏర్పడగానే రైస్‌మిల్ సిబ్బంది ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేసి తెలియజేశారు. వెంటనే స్పందించిన ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పి వేశారు.

ప్రేమ పెళ్లి చేసుకున్న జంట

కుభీర్, ఫిబ్రవరి 22 : నిర్మల్ జిల్లా కుభీర్‌కు చెందిన సగ్గం దీక్షిత్(23), బాసరకు చెందిన మయూరి(23) హైదరాబాద్‌లో చదువుకుంటుండగా వీరి మధ్య పరిచయం ఏర్పడి కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరి కుటుంబ సభ్యులు పెండ్లికి అంగీకరించక పోవడంతో శుక్రవారం వీరిరువురు కుభీర్‌లోని విఠలేశ్వరాలయంలో పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. బాసరకు చెందిన వధువు తరపు బంధువులు వాగ్వాదానికి దిగినప్పటికి ఇద్దరు ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నామని పోలీసుల ముందు అంగీకరించడంతో ఒప్పంద పత్రం రాసుకుని వెళ్లి పోయారు.

కేజీబీవీలో ఇంటర్ విద్యార్థినులకు వీడ్కోలు

బోథ్, ఫిబ్రవరి 22: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ విద్యార్థినులకు శనివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోథ్ ఎంపీడీవో రమేశ్, ఏపీవో జగ్దేరావ్ హాజరై విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రత్యేకాధికారిని ఆర్ వలిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమాజంలో చదువుతోనే గుర్తింపు

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జడ్జి జితిన్ కుమార్

దస్తురాబాద్, ఫిబ్రవరి 22 : సమాజంలో చదువుతోనే గుర్తింపు లభిస్తుందని ఖానాపూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, లీగల్‌సెల్ మండల కమిటీ చైర్మన్ జితిన్ కుమార్ అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని కేజీబీవీలో శనివారం మండల న్యాయ సేవ కమిటీ ఖానాపూర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఫోక్సో, న్యాయ, అటవీ, బాల కార్మికుల నిర్మూలన, తదితర చట్టాలు, సైబర్ క్రైమ్, షీటీంలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు అడిగిన సందేహాలకు జడ్జి సమాధానం చెప్పి నివృత్తి చేశారు. విద్యార్థులతో కలిసి ఆలయన భోజనం చేశారు. అనంతరం జడ్జిని శాలువాతో సత్కరించారు. ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్‌వో తిరుమల, ఎస్ఐ శంకర్, ఎఫ్ఆర్వో గీతారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మంత్రరాజం సురేశ్, న్యాయవాదులు, పోలీస్, ఫారెస్టు శాఖ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్


సీసీ కెమెరాలో రికార్డు అయినా ద్విచక్ర వాహనంపై ఆగంతకుడు

ఎదులాపురం, ఫిబ్రవరి 22: ఆదిలాబాద్‌లోని భాగ్యనగర్‌కు చెందిన పెట్లవర్ మౌనిక తాటిగూడ సమీపంలోని ప్రైవేట్ పాఠశాలకు వెళ్లి కొడుకుకి భోజనం తినిపించి బయటకు వస్తున్న క్రమంలో గేట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మౌనిక మెడలో నుంచి రెండు తులాల బంగారం పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు. కేకలు వేసిన మహిళ ఆలోపు గుర్తు తెలియని వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. ఒక్క రోజు ముందుగా అనుమానంగా ఓ వ్యక్తి తనను వెంబడించాడని బాధితురాలు వివరించింది. శనివారం నడుచుకుంటూ వచ్చి చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన అగంతకుడు అదే కాలనీలో సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను పరిశీలించామన్నారు. కాగా చైన్స్ స్నాచింగ్ చేసిన వ్యక్తి నంబర్లేని (ఎక్సెల్) ద్విచక్ర వాహనంపై వెళ్తున్నట్లు రికార్డు అయింది. చైన్స్ స్నాచింగ్ చేసిన ఆగంతకుడి కోసం పోలీసులు ప్రత్యేక గాలింపు చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదంగా వెంబడించిన వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఘనంగా లిటిల్ ఫ్లవర్ స్కూల్ వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ముథోల్, ఫిబ్రవరి 22 : నిర్మల్ జిల్లా ముథోల్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ 25వ వార్సికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ నజీబ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. విద్యార్థులు పాఠశాల దశ చాలా కీలకమైనదని శ్రద్ధ పెట్టి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ దిగంబర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★Wanted Helper for Cloth Showroom in Hyderabad. Food and Staying Facility is available. Call: 9000321282, 9849409986.
NT-09041_All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677